క్లుప్తంగా

మేకలను ఎత్తుకెళ్లిన దొంగలు

ములుగు రూరల్: మండలంలోని శ్రీనగర్‌లో మేకలను ఎత్తికెళ్లిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీనగర్ గ్రామానికి చెందిన బానోత్ మాన్యి తనకు ఉన్న మేకలను మేపుకుంటు జీవనం కొనసాగిస్తున్నాడు. మేకలను మేపు కొని వచ్చి రాత్రి సమయంలో ఇంటి ముందు ఉన్న కొట్టంలో తొలి రాత్రి నిద్రించాడు. ఉదయం లేచి చూసే సరికి కొట్టంలో తొమ్మిది మేకలు దొంగతనానికి గురయ్యాయని వాటి విలువ దాదాపు రూ.లక్ష 50 వేలు విలువ ఉంటుందని తెలిపారు. బాధితుడు మాన్యి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.

బలరాంనాయక్ గెలుపే లక్ష్యం



మంగపేట: మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని బోరునర్సాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించాలన్నారు. మంత్రి సీతక్క ఆదేశించిన విధంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి అత్యధిక మెజారిటీ తీసుకురావాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు గాదె శ్రావణ్‌కుమార్, ఆకుతోట వెంకన్న, కార్యదర్శులు ఎంపెల్లి సమ్మయ్య, మండల సర్వయ్య పాల్గొన్నారు.

పాఠశాలలో 'ఓపెన్ హౌస్'



వెంకటాపురం(ఎం): విద్యార్థుల మానసిక సామర్థ్యాలను స్వయంగా తల్లిదండ్రులు పరిశీలించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వేదవ్యాస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు తెలిపారు. మండల కేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. పిల్లలు ఏ విధంగా చదువుతున్నారో, రాస్తున్నారో స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ భాషబోయిన జగదీశ్వర్, పాఠశాల డైరెక్టర్లు చింతిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి, రాజయ్య, దగ్గు ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు పటేల్ యూత్ గర్జన సభ

ములుగు రూరల్: కరింనగర్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న పటేల్ యూత్ గర్జన సభను విజయవంతం చేయాలని జర్నలిస్టుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పిట్టల మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభలో పటేల్ గెజిట్ కోసం గ్రామ స్థాయి నుంచి మండల, డివిజన్, జిల్లా ప్రెస్ గవర్నమెంట్ వరకు గెజిట్ కోసం కావలసిన పత్రాలు, వివరాలను చర్చించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌లో చదువుతున్న విద్యార్థుల కోసం బాలికల వసతి గృహం ఏర్పాటుకు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. యువత అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

భూమి పూజ

టేకుమట్ల: మండలంలోని దుబ్యాల గ్రామంలో ఎల్లమ్మతల్లి గుడి పునర్‌నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. కమిటీ సభ్యులతో పాటు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, దుబ్యాల ఎంపీటీసీ బిక్కినేని అనిత సంపత్ రావు, మాజీ సర్పంచ్ బిల్లకంటి ఉమేందర్ రావు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండెబోయిన తిరుపతి, పోలుదాసరి రాజేశం, గుండెబోయిన మొగిలి, సమ్మయ్య, బండి సమ్మయ్య, రాజమల్లు, సంపత్‌రావు, స్వామి రావు, రవీందర్, మల్లయ్య, రమేష్, శ్రీనివాస్, చేరాలు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన రాజేశ్వరి గుడంబాను అమ్ముతుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు రాజేశ్వరీ ఇంటివద్ద తనిఖీ చేయగా గుడుంబా అమ్ముతూ పట్టుబడినట్లు తెలిపారు. దీంతో గుడుంబాను స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల భవనం

రేగొండ: మండల కేంద్రంలో దాదాపు మూప్పై ఏళ్ల క్రితం నిర్మించిన పశు వైద్యశాల భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో పశు వైద్య సిబ్బందితో పాటు వైద్యశాలకు వచ్చే వారు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు భాగిర్థిపేట, చెన్నాపూర్, దమ్మన్నపేట, తిరుమలగిరి, రామన్నగూడెం తదితర చుట్టూ పక్కల గ్రామాల రైతులకు సంబంధించిన పశువులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో రేగొండలో పశువుల ఆస్పత్రిని నిర్మించారు. రేగొండ ప్రాథమిక పశువైద్య కేంద్రం పరిధిలో తెల్ల పశువులు 1200, నల్ల పశువులు 1700, గొర్రెలు, మేకలు 8000, కుక్కలు 30 వరకు ఉన్నాయి. కాని వాటికి సరిపడా మందులు ఆస్పత్రిలో లేకపోవడంతో ప్రైవేట్ మెడికల్ షాపులలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వెటర్నరీ అసిస్టెంట్ కూడా ఇటీవలే డిప్యూటేషన్‌పై వచ్చాడు. మందులు, సిబ్బంది కొరతతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

తప్పని ఇబ్బందులు..

మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో నీటి సదుపాయం లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బందితో పాటు, వైద్యశాలకు వచ్చే రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అటెండర్ మరో చోటు నుంచి రోజు నీళ్ల తీసుకురావల్సిన పరిస్థితి ఏర్పడింది. వైద్యశాల ఆవరణలో నీటి సదుపాయం కొరకు గతంలో చేతి పంపును ఏర్పాటు చేశారు. కానీ గత నాలుగు సంవత్సరాలుగా చేతి పంపు పని చేయక పోయిన ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. నీటి వసతి లేకపోవడంతో మరుగుదొడ్ల నిర్వహణను కూడా గాలికొదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సౌకర్యాలు కల్పించాలని పశుపోషకులు కోరుతున్నారు.



మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి



మాట్లాడుతున్న డాక్టర్ నమ్రత

ములుగు రూరల్: విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ముందుకు సాగాలని ములుగు ఏరియా ఆస్పత్రి వైద్యురాలు నమ్రత సూచించారు. శుక్రవారం మండలంలోని జగ్గన్నపేట గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించినప్పుడే విజయం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు బలమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. యోగా వంటివి పాటించాలని అన్నారు. పరీక్షల ముందు విద్యార్థుల భయాన్ని పోగొట్టేందుకు అవగాహన కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్, లక్ష్మీ, రాంచందర్, పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలందించడమే ధ్యేయం



మహనీయుల గ్రంథాలను చూపిస్తున్న సభ్యులు

మల్హర్: స్వచ్ఛంద సేవలందించడమే ఆల్ ఎంప్లాయిస్ సొసైటీ ధ్యేయమని సొసైటీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు బండి రాజయ్య, కాళేశ్వరం జోనల్ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని తాడిచర్ల గ్రంథాలయానికి శుక్రవారం బహుజన వారియర్స్, రమబాయి, అంబేడ్కర్, సావిత్రిబాయి పూలే తదితర మహనీయుల చరిత్ర గ్రంథాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహనీయుల జీవిత చరిత్ర గ్రంథాలు ఇంటింటా అందజేయడం, పేద విద్యార్థులకు ఆర్థికంగా విద్యను ప్రోత్సహించడం, మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయడం, వారి జయంతి, వర్ధంతి ఉత్సవాలు తదితర కార్యక్రమాలు నిర్వహించడమే సొసైటీ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఉపాధ్యక్షుడు బండి సుధాకర్, ఏడబ్ల్యూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కేసారపు సురేందర్, కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువుకు సన్మానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

ములుగు: జిల్లా కేంద్రంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ జూనియర్ కళాశాలలో 2002–04 విద్యా సంవత్సరం ఇంటర్మీడియేట్ ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులు సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నారు. పూర్వ విద్యార్థులు గత అనుభవాలను పంచుకుంటూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పిచ్చిరెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన స్నేహం చాలా ముఖ్యమని అన్నారు. పూర్వ విద్యార్థులు ఒకే దగ్గర కలుసుకొని గురువులను సన్మానించడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు గురువులందరిని సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో గురువులు సుధాకర్, జాకబ్, రవిశాస్త్రి, మనోహర్, విద్యార్థులు శ్రీనివాస్, రాజు, మమత, జ్యోతి, సంతోష్, రాజు, భవాని, రాము, లావణ్య , సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న రాజు

చిట్యాల: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలలో పాల్గొనే డ్రీమ్స్–11 జట్టు క్రీడాకారులకు ఎంజాల భిక్షపతి(రేగొండ) స్మారకార్థం ఆయన కుమారుడు రాజు ఏకరూప దుస్తువులను పంపిణీ చేశారు. కాగా, శుక్రవారం చిట్యాల గ్రామానికి చెందిన గంగాధరి రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులు సమన్వయంతో ఆడుకోవాలని కోరారు. గెలుపు ఓటములు సహజం అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు కట్కూరి నరేందర్, నేపాలి రాకేష్, టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



రేగొండలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రేగొండ: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాడానికి ప్రజలందరూ సహకరించాలని చిట్యాల సీఐ మల్లేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారిపై ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున సహకరించాలని అన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో ఏమైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు దృష్టికి వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిరంతరం గ్రామాల్లో ఫ్లాయింగ్ స్క్వాడ్ బృందాలు నిత్యం పర్యవేక్షిస్తాయని, పోలీస్ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తారని, అక్రమంగా మద్యం నిల్వలు కలిగి ఉన్నా, రూ.50 వేలకు పైగా నగదుతో పట్టుబడినట్‌లైతే స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్సై శ్రీలత, సీఆర్పీఎఫ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు

వాజేడు: అటవీ జతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చితే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని మొరుమూరు గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ.. అడవి జంతువులను వేటాడడానికి విద్యుత్ తీగలను అమర్చడంతో ప్రజల ప్రాణాల మీదకు వస్తుందని చెప్పారు. అదే విధంగా పేకాట, కోడి పందేలు ఆడవద్దన్నారు. విప్లవ సంఘాలకు సహకరిస్తే చట్టపరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. గజాయి, సారాయి వంటి మత్తు పదార్థాలను వాడినా, అమ్మినా కేసులు నమోదు చేయ నున్నట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం సమీపంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా గ్రావిటీ కాల్వ వద్ద బెలేరా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఎస్సై భవానిసేన్ తన సిబ్బందితో కలసి స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో 25క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారులకు అప్పగించగా పంచనామా నిర్వహించారు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్న మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన రమేష్, రాజిరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ జగన్‌మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: పరకాలలో ఈనెల 15న నిర్వహించే వరంగల్ పార్లమెంట్ స్థాయి సదస్సును ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల కార్యకర్తలు జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెల్పుల వీరన్న పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సూరన్న మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మెదటినుంచి మాదిగలను మోసం చేస్తు వస్తున్నాడన్నారు. తెలుగుదేశంలో ఉన్నసమయంలో అన్యాయం చేశారని, బీఆర్ఎస్‌పార్టీలో చేరి మాదిగ ఉప కులాలకు రిజర్వేషన్లలో అన్యాయం చేశారని ఆరోపించారు. ఇప్పడు కాంగ్రెస్ పార్టీలో చేరి ఇటు ఎంపీ పసునూరి దయాకర్‌కు, దొమ్మటి సాంబయ్యలకు టికెట్ రాకుండా అన్యాయం చేసి కూతురు కావ్యకు టికెట్ తెప్పించుకున్నారన్నారు. పెద్దపల్లిలో గడ్డం వివేక్ వెంకటస్వామి కుటుంబం, వరంగల్‌లో కడియం శ్రీహరి కుటుంబాలే బాగుపడాలా, మిగితావారి కుటుంబాలు బాగు పడవద్దా అని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు గాజుల భిక్షపతి మాదిగ, హనుమకొండ ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి, నాయకులు దోర్నాల రాజేందర్, బాబు, నోముల శ్రీనివాస్, భరత్ పాల్గొన్నారు.

దాబాలకు ఎన్నికల కోడ్ వర్తించదా?

మంగపేట: మండలంలో దాబాల్లో మద్యం విక్రయాలకు ఎన్నికల కోడ్ వర్తించదా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు నిర్వహించొద్దంటూ దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్న అధికారులకు మండలంలోని దాబాల్లో బహిరంగంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా కనిపించకపోవడం లేదా అని అంటున్నారు. మండలంలో మద్యం షాపులు లేక పోవడంతో కొంత కాలంగా మండలంలోని కొందరు వ్యక్తులు ఏటూరునాగారంతో పాటు బద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక, మణుగూరు మండలాల నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. నిత్యం మండలం నుంచి వరంగల్, హనుమకొండకు వెళ్లే కొందరు ఆటోలు, కార్ల యజమానులు సైతం మద్యం తీసువచ్చి బెల్టు షాపుల నిర్వాహకులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తుడటంతో కొందరు బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం విక్రయాలను పూర్తిగా బంద్ చేయగా కొందరు మాత్రం చాటు మాటుగా విక్రయలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కానీ దాబా యజమానులు బహిరంగంగా మద్యం విక్రయాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలే తప్ప కేవలం బెల్టు షాపుల వారిపై దాడులు చేసి దాబా నిర్వాహకులను వదిలేయడం సరైంది కాదని విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు పేర్కొంటున్నారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న త్రివేణి భాస్కర్ దంపతులు

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 17న నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా విగ్రహల కొనుగోలు కోసం గ్రామానికి చెందిన తూడి త్రివేణి భాస్కర్ దంపతులు శుక్రవారం రూ.25వేల 116లు ఆలయ పూజారికి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండాల్‌రెడ్డి, వెన్నపురెడ్డి, సాంబశివరెడ్డి, సూరెడ్డి నర్సింహారెడ్డి, ఠాకూర్ లక్ష్మన్, నవరాం నాయక్, ముదుకోళ్ల రవి, జంగపెల్లి రాజయ్య, రామగిరి రాజు ఉన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు



ఇసుక లారీలను చూపుతున్న పోలీసులు

టేకుమట్ల: ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని, ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చలివాగు, మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు మండలంలోని బోర్నపల్లి గ్రామ శివారులో శుక్రవారం తనిఖీలు చేపట్టామన్నారు. అనుమతులు లేకుండా మానేరు వాగు నుంచి పొక్లెయినర్ సాయంతో రెండు లారీలలో ఇసుకను నింపి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం రాచకొండ సతీష్, యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం లింగవారిగూడెంకు చెందిన కత్తుల నరసింహ, ఓనర్ ఎస్‌కే ఇమ్రాన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. టేకుమట్ల మండలం బూర్నపల్లి గ్రామానికి చెందిన రేణికుంట్ల సుమన్, జమ్మికుంటకు చెందిన సదానందం లారీలను పిలిపించి పొక్లెయినర్‌తో ఇసుకను నింపి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని అన్నారు. పొక్లెయిన్ డ్రైవర్ కటకం సాయిరాంతో పాటు సుమన్, సదానందంలు తప్పించుకున్నారని అన్నారు. ఈ మేరకు ఇద్దరు లారీ డ్రైవర్లు, ఓనర్, పొక్లెయినర్ ఓనర్, ఇసుక తరలింపునకు సహకరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ తనిఖీలలో ఏఎస్సై పింగిలి అమరేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది రమేష్, మహేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్ల ఏర్పాటు




తొట్టిలో నీటిని పడుతున్న సిబ్బంది



దాహార్తి తీర్చుకోవడానికి వచ్చిన వన్యప్రాణులు

మహాముత్తారం: వేసవి కాలం నేపథ్యంలో అడవుల్లో వన్యప్రాణుల కోసం అటవీశాఖ అధికారులు ప్రత్యేకంగా నీటితొట్టెలను ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలంలోని పెగడపల్లి రేంజ్ పరిధిలో 20,000 హెక్టార్ల విస్తీర్ణంలో దట్టమైన అటవీ ప్రాంతంలో నీళ్ల స్థావరాలు లేని చోట మూడు కిలోమీటర్లకు ఒక దాని చొప్పున 25 పాయింట్లను ఎంచుకొని నీటితొట్లను ఏర్పాటు చేసినట్లు పెగడపల్లి ఇన్‌చార్జ్ రేంజర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ నీటి తొట్టెలను మూడు రోజులకు ఒక సారి పరిశీలించి నీళ్లను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో నీటి నిలువ కోసం కుంటలతో చెక్ డ్యాంలు నిర్మించినట్లు తెలిపారు. మరి కొన్ని ప్రాంతాల్లో తోగులు, కాల్వల వద్ద నీటి చెలిమెలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీటి స్థావరాలపై అటవీ జంతువుల వేటగాళ్లు ఉచ్చులు వేసే ప్రమాదం ఉన్నందున వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అలాగే ఇప్పపువ్వు సీజన్ కావడంతో వాటి సేకరణకు వెళ్లే గిరిజనులతో అటవీ జంతువుల వేటగాళ్ల సమాచారం తెలుకోవడంతో పాటు నీటి వసతులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిబ్బందితో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



రేగొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని భాగిర్థిపేట శివారు పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా భామ్రాగడ్ మండలం శోభానగర్‌కి చెందిన లాల్సు వాలే తెలమి జీవనోపాధి రీత్యా వరంగల్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం వరంగల్ నుంచి మహారాష్ట్రకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో భాగిర్థిపేట శివారులో ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాను ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలైన బాధితుడిని స్థానికులు గుర్తించి 108 కు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.